ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 12 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 24 ఏప్రిల్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# పాకిస్థానీయులకు నో ఎంట్రీ



**మోదీ అధ్యక్షతన అత్యవసర సమావేశం**
**ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో భద్రతా వ్యవహారాల**
**కేబినెట్ కమిటీ ఢిల్లీలో అత్యవసరంగా భేటీ**
**పాకిస్తాన్‌తో దౌత్య సంబంధాలు నిలిపివేత**
**సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటన**
**అటారి చెక్ పోస్టును నిలిపివేసిన కేంద్రం**
**భారత రక్షణ దళాలతో ప్రధాని మోడీ అత్యవసర భేటీ**
**ఉగ్రదాడిపై దర్యాప్తు ముమ్మరం.. రంగంలోకి ఎన్ఐఏ బృందం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం):** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిని భారత్ అత్యంత తీవ్రంగా పరిగణించింది. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు దౌత్యపరంగా కఠిన చర్యలకు దిగింది. పహల్గాం ఘటన నేపథ్యంలో ప్రధాని మోదీ నేతృత్వంలో సమావేశమైన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్ హస్తం ఉందని ఆరోపించిన కేంద్రం.. ఆ దేశంతో దౌత్య సంబంధాలకు సంబంధించి ఐదు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు వెల్లడించారు. పాకిస్థాన్‌తో కుదుర్చుకున్న సింధూ నదీ జలాల ఒప్పందం-1960 వెంటనే నిలిపివేత, అటారీలోని ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు తక్షణమే మూసివేత. సరైన ధ్రువపత్రాలతో భారత్‌కు వచ్చినవాళ్లు మే 1లోపు తిరిగి వెళ్లిపోవాలని ఆదేశం సార్క్ వీసా మినహాయింపు పథకం కింద పాకిస్థాన్ జాతీయులకు భారత్‌లోకి ప్రవేశం నిషేధం. దీని కింద గతంలో ఇచ్చిన వీసాలూ రద్దు. ఈ వీసా కింద ఇప్పటికే భారత్‌లో ఉన్న పాక్ పౌరులు 48 గంటల్లో స్వదేశానికి వెళ్లిపోవాలని ..మిగతా 2లో



## 16 నెలల్లో 2,44,962 కోట్లు

**రాష్ట్ర ప్రభుత్వం సాధించిన పెట్టుబడులివి**
**ఈ ఒప్పందాలతో 80,500 ఉద్యోగాలు**
**తాజాగా సీఎం రేవంత్ జపాన్ పర్యటనలో**
**12,600 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు**
**జపాన్ నుంచి హైదరాబాద్ చేరుకున్న సీఎం**

2



## ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నిక

**ఓటు హక్కు వినియోగించుకున్న 66మంది**
**25న కౌంటింగ్‌కు ఏర్పాట్లు**

**హైదరాబాద్, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం):** హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 77.56 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. 66 మంది బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం కార్పొరేటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే 22 మంది బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఈ ఎన్నికలో ఓటు వేయగా.. బీఆర్ఎస్ మినహా అన్ని పార్టీల ఎక్స్ అఫీషియో, కార్పొరేటర్లు ఓటింగ్‌లో పాల్గొన్నారు.

## పర్యాటకులు తిరుగు ప్రయాణం



**శ్రీనగర్ నుంచి**
**ప్రత్యేకంగా విమనాల ఏర్పాటు**
**6 గంటల వ్యవధిలోనే**
**3,300 మంది వెనక్కి**
**కేంద్రమంత్రి**
**రామ్మోహన్ నాయుడు వెల్లడి**

**శ్రీనగర్ ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం):** ప్రశాంతత చోటు చేసుకున్న కాశ్మీర్‌లో మరో మారు పర్యాటకులు వీడుతున్నారు. ఎంతో ఆనందంగా గడుపుదామని వచ్చిన యాత్రికులు ఇక్కడి నుంచి స్వస్థాలకు బయలుదేరరు. జమ్మూ కశ్మీర్‌లోని ..మిగతా 2లో

## కాశ్మీర్ నరమేధంతో సరిహద్దుల్లో పాక్ దళాలు

**భారీగా యుద్ధవిమానాల తరలింపు**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం):** జమ్ముకాశ్మీర్‌లో ఉగ్ర దాడి తర్వాత పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. అనంతనాగ్ జిల్లాలోని పహల్గాం ఉగ్రదాడితో మాకు సంబంధం లేదని ప్రకటించింది. ఈ మేరకు పాక్ రక్షణశాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రకటన విడుదల చేశారు. ఉగ్రదాడిలో ప్రాణనష్టం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. మరోవైపు, ఉగ్రదాడి ..మిగతా 2లో

## భూముల సమస్యలకు చెక్ పెట్టేలా మార్పులు

**అందరి ఆమోదంతోనే భూ భారతి**
**భూభారతి అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం):** భూ భారతి చట్టాన్ని అందరి ఆమోదంతోనే అమలు చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కొంతమంది వీఆర్వోలు కేసీఆర్ చెప్పిన పనులు చేయలేదని అర్ధరాత్రికి రాత్రి వీఆర్వో వ్యవస్థను రద్దు చేశారన్నారు. త్వరలో రెవిన్యూ వ్యవస్థలో జీపీఏ వ్యవస్థను తీసుకొస్తామని అన్నారు. జిల్లాలో జరిగిన భూభారతి అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. నూతనకల్ మండల కేంద్రంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏదైనా కొత్త చట్టం తీసుకొస్తే ప్రజలకు ఉపయోగపడాలి కాని భారంగా మారకూడదన్నారు. దొరగారి గొప్పతనం ... స్వార్థంకోసం.. ..మిగతా 2లో





## పార్టీ పదవుల్లో సీనియర్లకే పెద్దపీట

**పిసిసి అబర్వర్ల సమావేశంలో మీనాక్షి వెల్లడి**
**సమావేశానికి రానివారి పేర్లు తొలగింపు**

**హైదరాబాద్, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం):** కాంగ్రెస్ పార్టీ పదవుల్లో సీనియర్లకు పెద్ద పీట వేయనున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జీ మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో బుధవారంగాంధీభవన్ లో పీసీసీ అబ్జర్వర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 70 మంది అబ్జర్వర్లను ఆహ్వానించగా.. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితోపాటు మరో ఐదుగురు రాలేదు. దీంతో వారని ఆ పదవి నుంచి తొలగించారు. అదే విధంగా మీటింగ్ కు ఆలస్యంగా వచ్చిన వారిపైనా వేటు-పడింది. 2017 నుంచి పార్టీలో ఉన్న వారికే పదవులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. మండల, బ్లాక్ అధ్యక్షుల నియామకం కోసం జిల్లాకు ఇద్దరు అబ్జర్వర్లను నియమిస్తున్నట్టు కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ తెలిపారు. ప్రతి మండలం నుంచి పార్టీ మండలాధ్యక్ష పదవి కోసం ఐదుగురి పేర్లను పంపాలని సూచించారు. అదే విధంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం మూడు పేర్లను పీసీసీకి పంపాలని అబ్జర్వర్లకు మీనాక్షి నటరాజన్ సూచించారు. పార్టీ నాయకత్వంలో మహిళల ప్రాతినిధ్యం పెరగాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి చాలా చరిత్ర ఉందని, బ్రిటీష్ వాళ్లతో పోరాటం చేసిందని అన్నారు.



## ఉగ్రవాదులను ఊరికే వదలం

**తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు**
**ఘాటుగా హెచ్చరించిన రాజ్‌నాథ్ సింగ్**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం):** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకులపై జరిగిన ఉగ్రదాడి ఘటనకు బదులు తీర్చుకుంటామని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌పై కుట్ర పన్నుతున్న వారిని ఊరికే వదలబోమన్నారు. దాడికి భారత్ గట్టిబదులిస్తుందని ..మిగతా 2లో

## పేదోడికి సన్నబియ్యం బువ్వ అందించాలన్న ఆలోచన

**ప్రతి ఒక్కరూ ఇందుకు అర్హులు కావాలన్న లక్ష్యం**
**లబ్దిదారుడి ఇంట భోజనం చేసిన మంత్రి పొన్నం**

2

# ఉగ్రవాదులను ఊరికే వదలం

మొదటి పేజీ తరువాయి...

ఉగ్రవాదులను హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడి పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఉగ్రదాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించాలనేది భారత్ విధానమని.. ఉగ్రవాదులను ఎదుర్కొనే విషయంలో దేశ ప్రజలంతా ఐక్యంగా ఉన్నారని పేర్కొన్నారు. తమ కుటుంబసభ్యులను కోల్పోయిన బాధిత కుటు-ంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. దాడికి పాల్పడిన వారిని..కుట్ర పన్నిన వారిని బయటకు లాగి, తగిన బుద్ధి చెబుతామని అన్నారు. పహల్గాం ఘటనకు సంబంధించిన విషయాలు, శ్రీనగర్‌లో భద్రతా చర్యలు వంటి వాటి గురించి ఆయన ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠితో చర్చలు జరిపిన అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరగనున్న భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ- సమావేశంలోనూ ఆయన పాల్గొననున్నారు. కశ్మీర్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు మంగళవారం భీకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. మధ్యాహ్నం 3 గంటల సమయంలో సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు పర్యటకులను చుట్టు-ముట్టి.. అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 28 మంది ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ ఘటన అనంతరం అడవుల్లోకి పారిపోయిన ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు ముమ్మర గాలింపుచర్యలు చేపట్టాయి.

# పాకిస్థానీయులకు నో ఎంట్రీ

మొదటి పేజీ తరువాయి...

అల్టిమేటం. భారత్‌లోని పాక్ హైకమిషన్‌లో ఉన్న సైనిక, వాయు, నౌకాదళ సలహాదారులు వారం రోజుల్లో దేశం వీడాలని ఆదేశం. ఇదే సమయంలో భారత్ సైతం ఇస్లామాబాద్‌లో ఉన్న త్రివిధ దళాల సలహాదారుల్ని ఉపసంహరించుకుంటుందని వెల్లడి ఇరు వైపులా దౌత్య కార్యాలయాల్లో సిబ్బందిని 55 నుంచి 30కి కుదించాలని నిర్ణయం. మే 1వ తేదీ నుంచి ఇది అమల్లోకి వస్తుందని స్పష్టీకరణ ఉగ్రదాడిలో 26మంది మృతి: కేంద్రం ప్రకటన జమ్మూకశ్మీర్‌లో విజయవంతంగా ఎన్నికల నిర్వహణ, ఆర్థికాభివృద్ధి వైపు దూసుకెళ్తున్న వేళ పాక్ ఈ దాడులకు పాల్పడినట్లు భారత్ ఆరోపించింది. పహల్గాం దాడిలో 25 మంది భారతీయులు, ఓ నేపాల్ జాతీయుడు మృతి చెందినట్లు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించారు. ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేసిన ఆయన.. ఇటీవల తహవ్వుర్ రాణాను భారత్‌కు రప్పించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ భేటీ జరగనున్నట్లు తెలుస్తోంది.ల

**ఉగ్రదాడిపై దర్యాప్తు ముమ్మరం..**
**రంగంలోకి ఎన్ఐఏ బృందం**

పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన క్రూరమైన దాడి ఘటనపై దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇప్పటికే జమ్ముకశ్మీర్ పోలీసులు ఘటనపై దర్యాప్తు చేస్తుండగా తాజాగా జాతీయ దర్యాప్తు సంస్థ రంగంలోకి దిగింది. బుధవారం మధ్యాహ్నం జాతీయ దర్యాప్తు సంస్థకు చెందిన ఓ బృందం ఉగ్రదాది జరిగిన ప్రాంతానికి చేరుకుంది. కాగా, జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంకు సమీపంలోగల బైసరాన్ లోయలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఐదుగురు ముష్కరులు సైనికుల దుస్తుల్లో వచ్చి పర్యాకులే లక్ష్యంగా కాల్పులకు తెగబడ్డారు. మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుష పర్యాటకులను కాల్చిచంపారు. కాల్పుల్లో మొత్తం 28 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రదాడి సమాచారం అందిన వెంటనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా జమ్ముకశ్మీర్‌కు వెళ్లారు. ప్రధాని మోదీ తన సౌదీ పర్యటనను కుదించుకుని తిరిగొచ్చారు.



# 16 నెలల్లో 2,44,962 కోట్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లో దాదాపు రూ.2,44,962 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ మేరకు వివిధ దేశాలకు చెందిన కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. ఆ ఒప్పందాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిపి సుమారు 80,500 ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలో ఉన్న అవకాశాలు, పారిశ్రామిక అనుకూల పరిస్థితులపై సీఎం రేవంత్ దిగ్గజ కంపెనీలకు వివరిస్తున్నారు. గత ఏడాది జనవరిలో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం రూ.40 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగా.. ఈ ఏడాది దావోస్ సదస్సులో గతంకంటే మూడు రెట్లు అధికంగా రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. తద్వారా 50 వేల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. అమెరికా, దక్షిణ కొరియా, సింగపూర్ పర్యటనల్లో భాగంగా రూ.14,900 కోట్ల మేర పెట్టుబడులను సాధించారు. తాజాగా జపాన్ పర్యటనలో రూ.12,600 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకోగా 30,500 ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాగా, సీఎం రేవంత్ జపాన్ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకుని బుధవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్, ఎమ్మెల్యేలు ప్రకాషగౌడ్, వీర్లపల్లి శంకర్, టీ రామ్మోహన్‌రెడ్డి తదితరులు సీఎంకు స్వాగతం పలికారు.

# పర్యాటకులు తిరుగు ప్రయాణం

మొదటి పేజీ తరువాయి...

పహల్గాంలో పర్యటకులపై జరిగిన భీకర ఉగ్రదాడి భయభ్రాంతులకు గురిచేసింది. ఈ ఘటన తో వణికిపోయిన పర్యాటకులు వీలైనంత త్వరగా ఆ ప్రాంతాన్ని వీడుతున్నారు. ఇప్పటికే వేల సంఖ్యలో ప్రజలు సొంత ప్రాంతాలకు తిరుగు ప్రయాణమయ్యారు. కేవలం 6 గంటల వ్యవధిలోనే 3,300 మంది శ్రీనగర్‌ను వీడినట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఉగ్రదాడి నేపథ్యంలో శ్రీనగర్ నుంచి పర్యటకుల సురక్షిత ప్రయాణం కోసం అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. విమానాశ్రయంలో రద్దీ దృష్ట్యా ప్రత్యేక సదుపాయాలు కల్పించాం. ఆహారం, నీరు అందించాం. బుధవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీనగర్ ఎయిర్‌పోర్టు నుంచి 20 విమానాలు వెళ్లాయి. 3,337 మంది పర్యటకులు ఈ ప్రాంతాన్ని వీడారని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ప్రయాణికుల సౌకర్యం కోసం అదనపు విమానాలు అందుబాటులో ఉంచాం. టికెట్ ధరలు పెంచొద్దని విమానయాన సంస్థలను ఆదేశించాం. ఇప్పటికే అన్ని ఎయిర్‌లైన్లు టికెట్ క్యాన్సిలేషన్, రీషెడ్యూల్ ఛార్జీలను రద్దు చేశాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో మనమంతా పర్యటకులకు అండగా నిలవాలని కేంద్రమంత్రి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మరోవైపు తాజా పరిణామాలపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి స్పందించారు. కశ్మీర్ లోయ నుంచి అతిథులు వీడుతుంటే నా హృదయం ద్రవిస్తోందని అన్నారు. అయితే వారు ఎందుకు వెళ్లిపోవాలనుకుంటున్నారనేది నేను అర్థం చేసుకోగలను. పర్యాటకుల తిరుగు ప్రయాణం కోసం అన్ని ఏర్పాట్లు- చేస్తున్నాం. కేంద్రం కల్పించిన అదనపు విమానాలతో పాటు- రోడ్డు మార్గంలోనూ ప్రయాణ సౌకర్యాలు కల్పించాం అని సీఎం వెల్లడించారు. కశ్మీర్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు మంగళవారం భీకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. మధ్యాహ్నం 3గంటల సమయం సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యాటకులను చుట్టు-ముట్టి.. అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు గాలింపు చేపట్టాయి. మృతుల కుటుంబాలకు జమ్మూకశ్మీర్ ప్రభుత్వం రూ.10లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించింది. జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా మాట్లాడుతూ.. పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడి పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు. ఈ ఉగ్రవాద దాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. అత్యంత దారుణమైన ఈ దాడి వెనుక ఉన్న వారిని వదిలిపెట్టబోమని ప్రజలకు హామీ ఇస్తున్నాని స్పష్టం చేశారు. డీజీపీతోపాటు- భద్రతా అధికారులతో ఈ అంశంపై మాట్లాడానన్నారు. ఆర్మీ, జమ్మూ కాశ్మీర్ పోలీసు బృందాలు ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్నాయని వివరించారు.
తన మరో ఎక్స్ ఖాతా ద్వారా లెఫ్టినెంట్ జనరల్‌ఎల్జీ సిన్హా మాట్లాడుతూ.. ఉగ్రవాదులను తటస్థీకరించడానికి ఉగ్రవాద నిరోధక ఆపరేషన్ ప్రారంభించామన్నారు. యావత్ దేశమంతా కోపంగా ఉందని చెప్పారు. తమ దళాలు రక్తం కారుస్తున్నాయని చెప్పారు. పహల్గామ్ దాడికి పాల్పడిన వారు.. భారీ మూల్యం చెల్లించు కుంటారని తాను దేశానికి హామీ ఇస్తున్నానని పేర్కొన్నారు.

# కాశ్మీర్ నరమేధంతో సరిహద్దుల్లో పాక్ దళాలు

మొదటి పేజీ తరువాయి...

నేపథ్యంలో పాక్ అప్రమత్తమై సరిహద్దులకు యుద్ధ విమానాలను తరలిస్తోంది. సరిహద్దుల వెంట భారీగా సైన్యాన్ని మోహరిస్తున్న పాక్.. కాశ్మీర్ సరిహద్దుకు యుద్ధ విమానాలు తరలిస్తున్నట్లు సమాచారం. కాగా, ఈ ఉగ్రదాడిని ప్రపంచ దేశాలు ఖండించాయి. భారత్ కు తమ మద్దతును ప్రకటించాయి. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. మోడీకి ఫోన్ చేసి పరిస్థితులపై ఆరా తీశారు. ఈ క్రమంలో ఎల్ఓసీ సమీపంలో ఉన్న అన్ని ఉగ్రవాద శిక్షణా కేంద్రాలను ఖాళీ చేయాలని పాకిస్తాన్ ఆర్మీ సీనియర్ అధికారులు వెంటనే సూచనలు ఇచ్చారని సమాచారం. గత రాత్రి ఆలస్యంగా.. ఉగ్రవాదులను సమీపంలోని గ్రామాలకు తరలించమని ఆదేశాలు జారీ అయ్యాయని తెలుస్తోంది. భారత్ ప్రతీకారం తీర్చుకునే అవకాశం ఉన్నందున.. అంటే సర్జికల్ స్ట్రయిక్స్ లేదా వైమానిక దాడి వంటి చర్యలు తీసుకుంటారనే భయంతో పాక్ ఈ చర్యలకు పునుకొంది. ఉగ్రవాద దాడులపై ప్రతిస్పందించడంలో భారతదేశం ఆలస్యం చేయదని గత చరిత్ర చూస్తే ఇట్టే అర్థమవుతోందనే అభిప్రాయం పాక్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# భూముల సమస్యలకు చెక్ పెట్టేలా మార్పులు

మొదటి పేజీ తరువాయి...

నలుగురు వ్యక్తులు.. నాలుగు గోడల మధ్య కూర్చొని ధరణి చట్టం తీసుకొచ్చారని.. ధరణి అమలు చేసే సమయంలో వంద రోజులు రిజిష్ట్రేషన్లు జరగలేదన్నారు. గత ప్రభుత్వంలో కబ్జా చేసిన ప్రభుత్వ భూములను.. అక్రమ పట్టాలను రద్దు చేస్తామన్నారు. భూభారతిపై రైతులు అవగాహన కల్పించేందుకే అవగాహన సదస్సులు ఏర్పాటు- చేస్తున్నామని.. భూభారతి చట్టంలో తహశీల్దార్ నుంచి సీసీఎల్ఏ స్థాయి వరకు సమస్యలు పరిష్కరించేందుకు వెసులుబాటు కల్పిస్తామన్నారు. భూమి రిజిస్ట్రేషన్ కు ముందు తప్పనిసరిగా భూ సర్వే చేసి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుదని.. భూభారతి పోర్టల్ లో అన్ని సమస్యలకు స్వయంగా దరఖాస్తు చేసుకునేలా రూపొందించారు. భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు. భూ సమస్యలు పరిష్కరించేందుకు అధికారులే ప్రజల వద్దకు వస్తారని.. భూములున్న ఆసాములు, రైతులు తమ భూమి భద్రంగా ఉందని గుండెపై చేయి వేసుకుని నిద్దురపోవాలన్న లక్ష్యంతో భూభారతి రూపొందించామన్నారు. రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో భూభారతి పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నామని, ఒక్క రూపాయి ఫీజు లేకుండా భూ సమస్యలను పరిష్కరిస్తామని.., అధికారులనే క్షేత్రస్థాయికి పంపిస్తున్నామన్నారు. నెలాఖరులోగా నాలుగు మండలాల్లో అన్ని వివరాలు సేకరించి, జూన్ 2న పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నా రు. మే1వ తేదీ నుంచి మరో 28 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకుని భూభారతిని అమలు చేస్తామన్నారు. పైలెట్ మండలాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యల పరిష్కారంకోసం ఏమైనా సూచనలు వస్తే నియమనిబంధనల్లో మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. గత ప్రభుత్వం అనాలోచనతో 2020 ధరణి చట్టాన్ని తీసుకొచ్చి... ప్రజలకు అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు.

# ఉగ్రదాడి తీవ్రంగా కలచివేసింది

మొదటి పేజీ తరువాయి...

ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో అందరం దృఢంగా ఉందాం అని, మన భారత ఐక్యతను ఉగ్రవాదం విచ్ఛిన్నం చేయలేదని పేర్కొన్నారు. ఉగ్రదాడిలో మరణించిన వారి గౌరవార్థం జనసేన పార్టీ తెలుగు రాష్ట్రాల్లో మూడు రోజుల పాటు సంతాప దినాలను పాటిస్తుందని పవన్ కల్యాణ్ చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో బైసరన్ లోయలోకి సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు.. పర్యాటకులపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఉగ్రదాడిని ఖండిస్తూ మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో పార్టీ జెండాను పవన్ కల్యాణ్ అవనతం చేశారు. 'పహల్గాంలో జరిగిన దాడి నన్ను తీవ్రంగా కలచివేస్తోంది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. చనిపోయిన వారి గౌరవార్థం జనసేన పార్టీ తెలుగు రాష్ట్రాల్లో మూడు రోజుల పాటు- సంతాప దినాలను పాటిస్తుంది. పార్టీ జెండాను అవనతం చేస్తున్నాం. ఈ క్లిష్ట సమయంలో అందరం దృఢంగా ఉందాం, మన భారత ఐక్యతను ఉగ్రవాదం విచ్ఛిన్నం చేయలేదు. ఎప్పటి-కై-నా న్యాయమే గెలుస్తుంది. ఇలాంటి దారుణాలు మరలా జరగకుండా చూడాలి. భారత సాయుధ దళాలపై పూర్తి నమ్మకం ఉంది. సమష్టిగా మనం దీన్ని అధిగమిద్దాం, కలిసి కట్టుగా ఉందాం' అని పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

# పేదోడికి సన్నబియ్యం బువ్వ అందించాలన్న ఆలోచన

## ప్రతి ఒక్కరూ ఇందుకు అర్హులు కావాలన్న లక్ష్యం


## లబ్ధిదారుడి ఇంట భోజనం చేసిన మంత్రి పొన్నం

**హుస్నాబాద్, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం):** పేదోళ్లు కూడా సన్నం బువ్వ తినాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా కోహెడలో సన్న బియ్యం లబ్ధిదారు తలారి చంద్రయ్య ఇంట్లో మంత్రి పొన్నం, లెక్టర్ మనుచౌదరి, ఇతర అధికారులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సన్న బియ్యం కార్యక్రమం చారిత్రాత్మక నిర్ణయమని, దేశంలో మన రాష్ట్రంలో మాత్రమే ఈ కార్యక్రమం జరుగుతుంద న్నారు. తెలంగాణను ఆదర్శంగా తీసుకొని మిగతా రాష్ట్రాల్లో రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేసేలా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటే తాను సంతోషిస్తామని అన్నారు. అయితే సన్న బియ్యం పంపిణీ ని రాద్ధాంతం చేసే ప్రయత్నం చేయొద్దు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు న్యాయం చేయాలనీ చాలా కార్యక్రమాలు కొనసాగిస్తుంది. ఎవరు హక్కుదారులు ఎవరు వాటదారులు అనే సందర్భం ఇది కాదు. సన్న బియ్యం తింటున్న ప్రజలకు ఇంకా ఏవిధంగా మేలు చేయాలనే ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. ఒకవైపు సన్న బియ్యం మరోవైపు ఇందిరమ్మ ఇల్లు ,కొత్త రేషన్ కార్డులు ,200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందించడానికి మెస్ చార్జీలు ,కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం , ఉద్యోగ నియామకాలు చేశాం, సన్న వడ్లకి 500 బోనస్, కాంగ్రెస్ ప్రభుత్వం అనేక రకాల కార్యక్రమాలు చేపట్టిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు సన్న బియ్యం పథకం ఎలా ఉంది..? అని మంత్రి మల్లవ్వను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాము రేకుల గుడిసెలో నివాసం ఉంటున్నట్లు- చెప్పింది. మంత్రిని తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు మల్లవ్వ మంచి భోజనం పెట్టిందన్న మంత్రి పొన్నం ప్రభాకర్ వారి కుంటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంను ఉగాది పండుగ సందర్భంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సిద్ధిపేట జిల్లా, కోహెడ మండల కేంద్రంలో సన్న బియ్యం పథకం లబ్ధిదారులతో భోజనం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ పథకానికి సంబంధించి కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. సన్న బియ్యం పథకం ప్రజల మంచి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన చారిత్రాత్మక పథకంగా మారిందని, ఈ పథకం కింద, ప్రతీ పౌరుడికి కనీసం ఒకసారి సన్న బియ్యం తినేందుకు అవకాశం ఇవ్వడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం తెలంగాణలో మాత్రమే జరుగుతున్నందున, అది దేశంలో ఇతర రాష్ట్రాల ప్రేరణగా మారాలని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి పౌరుడికీ సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించిందని, ఉగాది పండుగ నుండి ఈ కార్యక్రమం ప్రారంభించా మన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రానికి ఒక గొప్ప పథకమని మంత్రి పొన్నం అన్నారు. తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింతగా ప్రజలకి చేరుకోవాలని, సన్న బియ్యం పథకంలోకి ప్రతీ పౌరుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు.జమ్మూ కాశ్మీర్ ఘటనపై కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. ఈ ఘటన చాలా బాధాకరం. ఇది రాజకీయాలకతీతంగా మనం ఖండించాలని అన్నారు. ఆయన అభిప్రాయం ప్రకారం, ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ తరహా సంఘటనలు పునరావృతం కాకుండా, కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని మంత్రి కోరారు.


# మతం పేరు అడిగి మర్మంగాలు చూసి మట్టు పెట్టారు

**సెక్యులరిజం నాయకులారా ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకోండి.**
**బీజేపీ సీనియర్ నాయకులు వెంకటరమణ గుప్తా.**

హైదరాబాద్: ఏప్రిల్ 23( ప్రభాత ఉదయం) సెక్యులరిజం పేరుతో చేతుల ముడుచుకొని మౌనంగా ఉన్న హిందూ మేధావులారా ఇప్పటికైనా మేల్కొండి, పహల్గం ఘటనను చూసైనా మా భావి తరాలకు బాటలు వేయాలని బీజేపీ సీనియర్ నాయకులు వెంకటరమణ గుప్తా కోరారు. బుధవారం మైలార్ దేవుపల్లి డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ మహాత్మా గాంధీ విగ్రహం దగ్గర పహల్గం దాడి ఘటనలో మృతిచెందిన వారికి సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ.... పహల్గం ఘటన ఒక్క కాశ్మీర్పై జరిగిన దాడి కాదని యావత్ భారతదేశం పై జరిగిన దాడిగా వర్ణించారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. శత్రుమూఖలు అప్పుడప్పుడు దాడులు చేయడం సహజమైన... ఈ దాడిలో మాత్రం ఉగ్రవాదులు మతం పేరు అడిగి మర్మంగాలు చూసి హిందువు అని నిర్ధారణ చేసుకున్న తర్వాత మట్టు పెట్టడం ఇది ఎంతో తీవ్ర గోరమైన చర్య అని ఉగ్రవాదుల తీరుపై మండిపడ్డారు. దేశంలో అన్ని మతాలు ఒకటే అని శాంతి శాంతి అంటూ సెక్యులరిజంతో చేతుల ముడుచుకున్న మేధావులందరూ మేల్కొనాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దేశ రక్షణ కోసం, భావి భారత భవిష్యత్తుకు యువత దేశానికి దన్నుగ నిలబడాలని కోరారు. పహల్గం ఘటన పూర్తిగా మతంను లక్ష్యంగా చేసుకొని జరిగిన ఘటన అని ఈ దాడికి ప్రతి కారం ఏ విధంగా ఉంటుందో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం చూపిస్తుందని..,. ఇక దాయాది దేశాలలో వణుకు పుట్టడం ఖాయమని అన్నారు. ఈ కొవ్వొత్తుల ర్యాలీలో స్థానిక నాయకులు ఎస్ వెంకటేష్, సోమ శ్రీనివాస్, భూసం కాళిదాస్, పల్లపు జగన్, సురేష్, కిషోర్, కిరణ్, మహేష్ తదితరులతోపాటు స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




బాబుల్ రెడ్డి నగర్ లో మహాత్మా గాంధీ విగ్రహం దగ్గర కొవ్వొత్తుల ర్యాలీ.



బిజెపి సీనియర్ నాయకులు వెంకటరమణ గుప్తా



జమ్ము కాశ్మీర్ ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి కలుగాలని కోరుతు బుధవారం రాత్రి బాబుల్ రెడ్డినగర్ లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించిన బీఆర్ఎస్ మైలార్దేవుపల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్, నాయకులు వెంకటరమణ గుప్తా, ఉప్పల్ శ్రీను, సందీప్, మల్లేశ్, కాళీదాసు, సునీల్, కిషోర్, రాయుడు, జగన్, సురేశ్, దినేశ్, గోపాల్ నాయక్, కిరణ్, నాని లు

- బుద్వేల్, ప్రభాత ఉదయం



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

## జమ్ము కాశ్మీర్ పాహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తు కొవ్వొత్తుల ర్యాలీ

### పాల్గొన్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

బుద్వేల్, ఏప్రిల్23(ప్రభాత ఉదయం): మంగళవారం జమ్ము కాశ్మీర్ పాహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తు బుధవారం సాయంత్రం మైలార్దేవుపల్లి శివాజీ చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ పాల్గొన్నారు. ఉగ్రదాడిలో మరణించిన పర్యాటకుల ఆత్మలకు శాంతి కలుగాలని భగవంతున్ని ప్రార్థించారు. ఉగ్రదాడిలో మరణించిన వారి కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాడ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ ర్యాలీలో మైలార్ దేవుపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నత్తి దనుంజయ్, నాయకులు అడికె అర్జున్, కాశీగారి యాదగిరి, బాస శ్రీను, నాని, బండారి యాదగిరి, మసున వెంకటేశ్, యంజాల శేఖర్. అంజనేయులు, శరణమ్మ, పుష్ప, వజ్రమ్మ లు పాల్గొన్నారు.



పీడీపీ చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన

## పీడీపీ చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన

బుద్వేల్, ఏప్రిల్23(ప్రభాత ఉదయం) : జమ్ము కాశ్మీర్ లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తు బుధవారం పీడీపీ చౌరస్తాలో రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొక్క ప్రభాకరరెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రదాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దాడిలో మరణించిన కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. మరణించిన వారి కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కోరని బాల్ రాజ్ , ఎం.ఎ. నయీమ్, పెండ్యాల శ్రీధర్, మహ్మద్ గౌస్ ఆలీ, ఎం.శ్రీకాంత్, రవి, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.



గేటుకు పూజలు చేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం సుగుణ రెడ్డి

## పాఠశాలకు నూతన గేటు ఏర్పాటు

బుద్వేల్, ఏప్రిల్ 23(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కు నూతన గేటు ను అమర్చారు. గతంలో ఉన్నటువంటి గేటు శిధిలావస్థకు చేరుకోవడంతో ఆ గేటు స్థానంలో ఇరు వైపుల సిమెంటు దిమ్మెలను నిర్మించి పాడైన గేటు స్థానంలో నూతన గేటును అమర్చారు. అందుకు అయిన ఖర్చులో రూ. 75వేలు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం.సుగుణారెడ్డి ఇవ్వగా, రామయ్య హాస్పిటల్స్ అదినేత, ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సుల్తాన్ అమరేందర్ రూ.20వేల విలువ గల స్టీల్, సిమెంటు ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు ఎన్.వెంకటేశ్, రాజు లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం.సుగుణారెడ్డి మాట్లాడుతూ, పాఠశాలలు దేవాలయాలతో సమానమని, వాటి అభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులే ఎక్కువగా చదువుకుంటారని, వారికి కావాల్సిన మౌళిక సదుపాయాలు కల్పించడానికి ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి సహకరిం చాలన్నారు.

## హిమాయత్ సాగర్ అలీ ఫామ్‌హౌస్‌లో ఘనంగా

# మేఘన-శ్రీమన్నారాయణ నిశ్చితార్థ వేడుక



మేఘన - శ్రీమన్నారాయణ ల నిశ్చితార్థ వేడుక



పూల దండలు మార్చుకుంటున్న మేఘన బి శ్రీమన్నారాయణలు




మేఘన కుటుంబ సభ్యులు

బుద్వేల్, ఏప్రిల్ 23(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ వాస్తవ్యులు గుండు శ్రీనివాస్ బి మానస ల ప్రధమ కుమార్తె మేఘన నిశ్చితార్థం బుధవారం కాళేశ్వరం వాస్తవ్యులు పెండ్యాల రాజయ్య - వాణి ల కుమారులు శ్రీమన్నారాయణ తో ఘనంగా జరిగింది. హిమాయత్ సాగర్ అలీ ఫామ్ హౌస్ లో జరిగిన ఈ వేడుకలో ఇరు కుటుంబాల బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. హిమాయత్ సాగర్ జలాశయం ఒడ్డున పచ్చని చెట్ల మధ్య ప్రకృతి రమణీయతలో ఈ నిశ్చితార్థ వేడుక జరిగింది. నిశ్చితార్థ వేడుకలలో గుండు శ్రీనివాస్ సోదరులు జి వేణుగోపాల్ - లక్ష్మి, జి మురళీధర్ - లత లు దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. శ్రీనివాస్ సోదరీమణులు ఎం అన్నపూర్ణ, టి గీత - టి కృష్ణ లతో పాటు కుటుంబ సభ్యులు, బందువులు పాల్గొన్నారు.



శ్రీమన్నారాయణ కుటుంబ సభ్యులు



మేఘన బి శ్రీమన్నారాయణ లను ఆశీర్వదిస్తున్న అప్పారెడ్డి గూడెం భీమయ్య - మాధవి లు

## మంత్రా మాల్ పక్కన షెడ్డు నిర్మాణం పనులు జరుగడం లేదు

### డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్

బుద్వేల్, ఏప్రిల్ 23(ప్రభాత ఉదయం): అత్తాపూర్ నుంచి పీడీపీ చౌరస్తా కు వెళ్లే మార్గం లో మంత్రా మాల్, విశాల్ మార్ట్ మద్యలో చేపడుతున్న షెడ్డు పనులను బుధవారం రాజేం ద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పరిశీలన చేశారు. వారు వెళ్లినప్పుడు అక్కడ ఎలాంటి పనులు జరుగడం లేదని గుర్తించారు. గతంలో షెడు పనులు చేస్తుండగా రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇవ్వడం తో పనులు అపివేసినట్లు గుర్తించారు. షెడ్డు నిర్మాణం జరుగుతున్న ప్రాంతానికి తాళం వేశారు. అనదికార షెడ్డు నిర్మాణ విషయంలో షెడ్డు నిర్మిస్తున్న వారికి నోటీసులు అందజేశామని డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ తెలిపారు. షోకాజ్ పీరియడ్ కొనసాగుతున్నదని, ఆ తర్వాత షెడ్డు నిర్మాణం పై చర్యలు తీసుకుం టామన్నారు. ప్రస్తుతమైతే ఎలాంటి పనులు జరుగడంలేదన్నారు.



మంత్ర మాల్ పక్కన షెడ్డును పరిశీలిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది





ఆరాంఘర్ చౌరస్తాలో పాకిస్థాన్ ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

## జమ్ము కాశ్మీర్ ఉగ్రదాడిని నిరసిస్తు పాకిస్థాన్ దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ నాయకులు

బుద్వేల్, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం): జమ్మూ కాశ్మీర్ లో పర్యాటకులపై మంగళవారం జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తు రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ పొన్నమోని మల్లేశ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఆరాంఘర్ చౌరస్తాలో పాకిస్థాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి కలుగాలని, గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. భారతమాతకు జై అంటు నినాదాలు చేశారు. జమ్ముకాశ్మీర్ లో జరిగిన ఉగ్రవాదాన్ని భారత్ ప్రధాని నరేంద్రమోడీ చూస్తు ఊరుకోరని గుర్తు చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మైలార్దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీదర్, కార్యదర్శి ఎం.కొమురయ్య. రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు కోరని సదానంద్, నాయకులు ఎ.భీమార్జున్ రెడ్డి , బి.మహలింగంగౌడ్, కాడెం సుదాకర్, జోగి రవి, బిస్.విజయ్ కుమార్, రాచూరి రాజశేఖర్, ఎన్. జగన్, జి. బాబురావు, అడికె జనార్దన్, నర్సిరెడ్డి, పాండు యాదవ్, కిరణ్ చారి, కోరని క్రాంతి, రావుల భాస్కర్, నవారు మురళీధర్ రెడ్డి , రాహుల్ రెడ్డి, యు లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



మరణించిన పేద మహిళ వివరాలు సేకరిస్తున్న అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ కె నాగేశ్వర్ రావు, ఎస్ ఐ వెంకన్న లు

## మరణించిన పేద మహిళ సమాధి కార్యక్రమాలు దగ్గరుండి నిర్వహించిన అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు

బుద్వేల్, ఏప్రిల్ 23(ప్రభాత ఉదయం): ఫ్రెండ్లీ పోలీసింగ్ కు నిజమైన అర్థం చేకూరేలా పనిచేశారు అత్తాపూర్ ఇన్స్పెక్టర్ కె. నాగేశ్వర్రావు, ఎస్ఐ వెంకన్నలు. పోలీస్ అంటే కాటిన్యమే కాదు కరుణ కూడా ఉంటుంది అని చాటి చెప్పారు. నా అనే వారు ఎవరు లేని యాచకురాలు గా ఆరాంఘర్ చౌరస్తాలో ఉండే ఓ ముస్లీం మహిళ మరణిస్తే ఆమెకు అన్నీ తానై ముందుండి సమాధి కార్యక్రమాలు చేయించారు. ఈ కార్యక్రమాన్ని జరిపించిన ఇన్స్ పెక్టర్ కె.నాగేశ్వర్ రావు , ఎస్ఐ వెంకన్న లను చూసిన ప్రజలు వారిని అభినందనలతో ముంచెత్తారు. వివరాలు ఈ విధం గా ఉన్నాయి..... ఆరాంఘర్ చౌరస్తా ప్రాంతంలో యాచకురాలుగా ఉంటు నా అనే వారు ఎవరు లేని ఓ మహిళ అక్కడనే ఉండేది. అనారోగ్య సమస్యలతో ఆమె బుధవారం మరణించింది. సమాచారం తెలుసుకున్న అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ కె.నాగేశ్వర్ రావు . ఎస్ఐ వెంకన్నలు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆమె మృతదేహాన్ని తీసుకువెళ్లడానికి ఎవరు రాకపోవడంతో నౌ నెంబర్ ప్రాంతంలోని మస్తాన్ బాబా ఖబరస్తాన్ కు చెందిన స్మశానవాటికలో స్థానిక పెద్దలతో మాట్లాడి స్థలాన్ని చూసారు. బుధవారం నమాజ్ ఏ జనాజ పూర్తి అయిన తర్వాత ఆ పేద మహిళ సమాధి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్మశానవాటిక పెద్దలు అక్బర్ ఖాన్, అక్రమ్ ఖాన్ లు కూడా పోలీసులకు సహకారం అందించారు. ఈ మంచి కార్యక్రమాన్ని చేపట్టిన అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ కె.నాగేశ్వర్ రావు . ఎస్ఐ వెంకన్న లను స్థానికులు అభినందించారు.

## పహల్గాం ఘటన పిరికిపందల చర్య!

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్

రంగారెడ్డి,ఏప్రిల్ 23:(ప్రభాత ఉదయం) జమ్ము కాశ్మీర్ పహల్గాం లో జరిగిన ఉగ్ర దాడి ముమ్మాటికి పిరికిపందల చర్య అని, ఈ ఘటన చాలా బాధాకరమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్ తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదులు జరిపిన నరమేధానికి 27 మంది మృతి చెందడమే కాక పదుల సంఖ్యలో పర్యాటకులు గాయపడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు హిందువులను లక్ష్యంగా చేసుకుని సాధారణ పౌరులను పొట్టన పెట్టుకోవడం ఇంతకు మించిన దుర్మార్గపు చర్య లేదని మండిపడ్డారు.



సరిహద్దులో పర్యాటకులను టార్గెట్ చేసుకుని విచక్షణారహితంగా కాల్పులు జరిపిన దుర్మార్గులను పట్టుకొని బహిరంగంగా కాల్చి చంపాలని కోరారు. ఉగ్ర దాడిలో మరణించిన కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం అల్లరిమూకలను మట్టుపెట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలని... అందుకు యావత్తు భారత ప్రజలు, ప్రత్యేకంగా యువత దేశానికి, సైనికులకు మేమున్నాం అంటూ భారీ నీరసనలతో దన్ను గా నిలవాలని బుక్క వేణుగోపాల్ కోరారు. జమ్ము కాశ్మీర్ లో గత కొంత కాలంగా ప్రశాంత వాతావరణం నెలకొన్న తరుణంలో ఉగ్రవాదులు దాడులకు పాల్పడిన సంఘటన యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య

బుద్వేల్, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం) : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి.. బీహార్ కు చెందిన టింకు కుమార్ (31) జ్యోతి బిలు భార్యభర్తలు. వారికి 10వ తరగతి చదువుతున్న కుమార్తె ఉంది. ఐదు సంవత్సరాలుగా వీరు టీఎన్జీవోస్ కాలనీలో నివాసం ఉంటున్నారు. టింకు కుమార్ లిఫ్ట్ మెకానిక్ గా పనిచేస్తుండగా, జ్యోతి కంపెనీలో కార్మికురాలుగా పనిచేస్తుంది. టింకు యాదవ్ ఆర్థిక ఇబ్బందులతో బాదపడుతున్నాడు. బుధవారం భార్య పనికి వెళ్లగా, కుమార్తె స్కూల్ కు వెళ్లింది. ఇంట్లో ఒక్కడే ఉన్న టింకు కుమార్ బెడ్ షీట్ తో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన కుమార్తె తలుపు తట్టడంతో ఎంతకు తీయలేదు. తలుపులు తోయడంతో తెరుచుకున్నాయి. ఇంట్లో కి వెళ్లి చూడగా టింకు కుమార్ ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. ఈ విషయాన్ని తల్లికి ఫోన్ చేసి చెప్పింది. ఆమె వచ్చి మైలారేవుపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చింది. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ పైడీ నాయుడు వివరాలు సేకరించారు. పోసుమారం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేసున్నారు.

# రైతులకు అన్ని విధాలా ఉపయోగపడే చట్టం భూ భారతి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్

### భూ భారతి ద్వారా రైతులకు న్యాయం జరగాలంటే ఆన్ లైన్ మనిటరింగ్ ఉండాలి
### రైతులతో పాటు అధికారులకు ఒరియేంటేషన్ క్లాస్ లు నిర్వహించాలి
### కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్
### ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మొదటి విడత లక్ష రూపాయల చెక్ ను అందజేసిన ఎమ్మెల్యే



వరంగల్, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం బ్యూరో): భూ రికార్డులలో తప్పులను సరిదిద్దడానికి, రైతులకు మెరుగైన సేవలు అదించడానికి భూ భారతి - 2025 ఆర్ఓఆర్ చట్టాన్ని తీసుకురావడం జరిగిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ తెలిపారు. వరంగల్ జిల్లావర్ధన్నపేట టౌన్ పరిధిలోని ఏ బి ఎస్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన భూ భారతి అవగహన సదస్సులో జిల్లా కలెక్టర్ సత్య శారద దేవి, అదనపు కలెక్టర్ సంధ్యా రాణి , ఎమ్మెల్యే ఎమ్మెల్యే నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ భారతి చట్టంలోని అంశాలను అధికారులు రైతులకు వివరించారు. రైతులు అడిగిన సందేహాలను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి ధరణి కంటే మెరుగైన చట్టం భూ భారతి చట్టం అని అన్నారు. భూ సమస్యలను పరిష్కరించడానికి ఎప్పటికప్పుడు కొత్త చట్టలను రూపొందించుకుంటున్నామని తెలిపారు. ఆర్ఓఆర్, 1బీ, ధరణి, ఇప్పుడు భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. భూ భారతి ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించడానికి, భూ రికార్డులలో జరిగిన తప్పులను సవరించడానికి అవకాశం లభించిదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10లక్షల సాదా బైనామా దరఖాస్తులను పరిష్కారానికి భూ భారతి చట్టం ద్వారా మార్గం సుగమం అయిందని తెలిపారు. అలాగే పార్ట్ బీ ద్వారా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల సమస్యల పరిష్కారానికి అవకాశం లభిస్తుందని అన్నారు. గతంలో జరిగిన పొరపాట్లను దృష్టిలో పెట్టుకొని భూభారతి చట్టం ద్వారా రైతులకు న్యాయం జరగాలంటే ఆన్లైన్ మానిటరింగ్ ఉండాలని సూచించారు. రైతులు ఆన్లైన్లోనే దరఖాస్తు చేసుకోవాలి ఆన్ లైన్ లోనే స్లాట్ బుక్ చేసుకునే వెసులుబాటు ఉండే విధంగా ఆన్లైన్ మానిటరింగ్ సిస్టంను రూపొందించాలని కలెక్టర్ కు సూచించారు. వ్యక్తిగతంగా తప్పులు చేయడానికి అవకాశం లేకుండా వ్యవస్థను అవినీతి రహితంగా మార్చినప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని వెల్లడించారు. రైతులతో పాటు అధికారులకు ఒరియేంటేషన్ క్లాసులు నిర్వహించాలని తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించడానికి, రైతులకు మెరుగైన సేవలు అందించే విధంగా రెవెన్యూ సిబ్బంది పనితీరు ఉండాలని ఆ దిశగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వర్ధన్నపేట మండల పరిధిలోని కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ 19 మంది లబ్ధిదారులకు 19లక్షల 2వేల 204 రూపాయల విలువ చెక్కులను కలెక్టర్ తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం వర్ధన్నపేట మండల పరిధిలోని వెంకట్రావుపల్లె గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మొదటి విడుతగా 1 లక్ష రూపాయలు చెక్కును కలెక్టర్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్డిఓ, మున్సిపల్ కమిషనర్, ఎమ్మార్వో, ఎంపీడీఓ, వర్ధన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, వరంగల్ జిల్లా కిసాన్ జిల్లా అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, టౌన్ అధ్యక్షుడు మైస సురేష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడుపత్రి భాను ప్రసాద్, కుల్ల యాకాంతం, మండల మహిళ అధ్యక్షురాలు మరుపట్ల అరుణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



## మేఘ ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్లు భూమి పూజలో పాల్గొన్న తెలంగాణ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, మేనేజింగ్ డైరక్టర్ యాస్మిన్ భాషా (ఐఏఎస్)

### ఆయిల్ ఫెడ్ అధ్వర్యంలో రాష్ట్ర ప్రజల కోసం వినియోగదారులుకు మరో సువర్ణ అభివృద్ధి కార్యక్రమం

వరంగల్ ,ఏప్రిల్ 23 ( ప్రభాత ఉదయం బ్యూరో): హైదరాబాదులోని శివరాంపల్లి లో తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మరో మేఘ అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రజలకువంట నూనెల వినియోగధారులకు నాణ్యమైన వంట నూనెలు అందించడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తో కూడిన భారీ ప్రాసెసింగ్ మిల్లు ను దసరా వరకు అందుబాటులో కి తేనున్నట్టు ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి తెలిపారు. ఈ మిల్లు నిర్మాణం పనులను వేగవంతంగా చేయడానికి కార్పొరేషన్ అండగా ఉంటుందని కాంట్రాక్టర్లు ఈ విషయాన్నీ దృష్టి లో పెట్టుకుని మిల్లు పనులను త్వరిత గతం గా పూర్తి చేసి అనుకున్న సమయానికి అందుబాటులో కి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి,హెచ్ ఆర్ మేనేజర్ సత్యనారాయణ, మార్కెటింగ్ మేనేజర్ తిరుమలేష్ రెడ్డి,ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



## రైతులు భూభారతి చట్టంపై అవగాహన పెంపొందించుకోవాలి: జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ



గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23(ప్రభాత ఉదయం)రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం భూ సమస్యల పరిష్కారానికి కీలకమైందని, రైతులు దీనిపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ తెలిపారు.బుధవారం కే.టీ దొడ్డి మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి చట్టం-2025 అవగాహన సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొని,చట్టం మరియు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి చట్టం రూపొందిం చిందన్నారు.
ఎంతోమందిమేధావులు,అధికారులు భూభారతి చట్టానికి రూపకల్పన చేశారని వివరించారు. భూ పరిపాలన వ్యవస్థ అనేక దశల్లో అభివృద్ధి చెందిందని,గతంలో జరిగిన కొన్ని చట్టాలు, సర్వేలు, పాస్‌బుక్‌లు, ఆర్.ఓ.ఆర్ చట్టం వంటి చర్యలను గుర్తుచేశారు.ధరణి పోర్టల్‌లో లేని అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభించనున్నదని తెలిపారు.ఈ చట్టాన్ని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించారు.చట్టం రూపొందించే సమయంలో రైతుల సంక్షేమం కోసం వారి సమస్యలను ప్రస్తావించి, అభిప్రాయాలను చట్టంలో ప్రతిబింబించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. గతంలో ధరణి ద్వారా మన జిల్లా టాప్ 5లో ఉండగా,భూ భారతి చట్టంతో ప్రక్రియలు త్వరగా పూర్తి అవుతాయని తెలిపారు.ధరణిలో భూ సమస్యలపై దరఖాస్తు చేసుకునేందుకు 33 మాడ్యూల్స్ పొందుపరచారని, దీనివల్ల ఏ సమస్యకు ఏ మాడ్యూల్‌లో దరఖాస్తు చేయాలో రైతులకు అర్థమయ్యేది కాదని అన్నారు. భూభారతిలో 6 మాడ్యూల్స్ మాత్రమే ఉండి సులభమైన దరఖాస్తు ప్రక్రియ ఉంటుందని వివరించారు.భూ భారతి చట్టంలో తహసిల్దార్ స్థాయి నుండి సీసీఎల్ఏ స్థాయి వరకు సమస్యలను పరిష్కరించే అప్పీల్ వ్యవస్థను వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడిందని,భూమి రిజిస్ట్రేషన్,మ్యూటేషన్ ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. భూముల విస్తీర్ణం, మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని తెలిపారు.వార సత్వంగా వస్తున్న యజమానులకు పేరు మార్పులు చేయవచ్చని తెలిపారు.పెండింగ్ లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు.ఈ దరఖాస్తుల పై తహసిల్దార్ 30 రోజుల్లోగా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకుంటారని అన్నారు.గడువు తర్వాత ఆటోమేటిక్ గా మూటేషన్ జరుగుతుందని అన్నారు.మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు చేస్తారని,దీని ద్వారా భూ ఆక్రమణలకు అవకాశం ఉండదని అన్నారు.గ్రామ స్థాయిలో సదస్సులు నిర్వహించి భూ సమస్యలు త్వరగా పరిష్కరించడానికి అవకాశం కల్పిస్తామన్నారు.భూ భారతి చట్టం మొదట రాష్ట్రవ్యాప్తంగా నాలుగు మండలాల్లో పైలెట్‌గా అమలవుతుందని,తరువాత ప్రతి జిల్లాలో ఒక్క మండలంలో నిర్వహించి,అవసరమైతే మార్పులు చేసి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తారని తెలిపారు.రాబోయే రోజులలో భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేస్తారని తెలిపారు.భూమి హక్కుల రక్షణకు భూ భారతి చట్టం ఉపయోగకరమైందని,రైతులు దీన్ని అర్థం చేసుకుని ఉపయోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస రావు,గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు,గద్వాల్ మార్కెట్ యార్డు చైర్మన్ నల్ల హనుమంతు,కేటీ దొడ్డి తాసిల్దార్ హరి కృష్ణ,రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## హిందువులపై మారణకాండను హిందుస్థాన్ సహించదు:

### బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
### వరంగల్ నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ ,శాంతి ప్రదర్శన

వరంగల్ ,ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం బ్యూరో): పహల్గాం విషాద ఘటనపై వరంగల్ లో బీజేపీ జిల్లా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ శాంతి ప్రదర్శన నిర్వహించారు. పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడి దేశ హృదయాన్ని కలిచివేసింది. మానవత్వం లేని మృగాలు చేసిన ఒక పిరికిపందల చర్య ఇది పర్యాటకులపై జరిగిన ఈ అమానుష దాడిలో 27 మంది అమాయక హిందువులు ప్రాణాలు కోల్పోవడం, మరికొందరు తీవ్రంగా గాయపడటం దురదృష్టకరం, బాధాకరం అని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాద ఘటనను తీవ్రంగా ఖండించారు. బుధవారం సాయంత్రం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుంచి పాపయ్యపేట చమన్ వరకు మౌనంగా చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీ దేశమంతటా చలించిపోయేలా చేసింది. ఈ శాంతి ప్రదర్శనలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని తమ ఆవేదనను వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ ఇలాంటి పిరికిపందల దాడులతో భారత్‌ను భయపెట్టలనుకోవడం పిరికిపందుల చర్య అన్నారు. మోదీ సర్కార్ ఎప్పటికీ కవ్వింపు చర్యలను సహించదనీ,దేశ భద్రతపై గట్టి స్థానంలో ఉంది. ప్రతి అమాయక ప్రాణం వెనుక న్యాయం నిలబడే వరకు కేంద్ర ప్రభుత్వం నిద్రపోదనీ, తప్పకుండా మూల్యాన్ని చెల్లించుకోవాల్సిందే అన్నారు. ఇది కేవలం దాడి కాదు, ఇది మానవత్వాన్ని చీల్చే ప్రయత్నం. దేశం మొత్తంగా ఈ విషాదం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఇలాంటి ఘటనలపై ఏ ఒక్క భారతీయుడు కూడా ఊరుకోడని గంట రవికుమార్ వ్యాఖ్యానించారు. పాకిస్తాన్ లో రాజకీయంగా, ఆర్థికంగా అస్థిరత ఉన్నప్పటికీ, ఆ దేశం తమ అంతర్గత వైఫల్యాలను ధ్వంసకాండాలుగా మారుస్తూ భారత్ పై కుట్రలు చేస్తున్నది. కానీ భారత్ సహనం, శక్తి, సంఘీభావం కలగలిసిన దేశం. ఈ దేశ పౌరుల మీద దాడి జరిగితే నిశ్శబ్దంగా ఉండే దేశం కాదు. ఇప్పటికే పాకిస్తాన్ ఆర్థిక పరిస్థితి అధ్వాన్నం అయింది. ఇక ఇప్పుడు మళ్ళీ దాడులతో రెచ్చగొట్టే తమ పతనాన్ని తామే రచ్చించుకున్నారు అన్నారు. ఈ దేశంలోని కొంతమంది ముస్లింలు కూడా ఈ దాడుల విషయలో మౌనంగా ఉండడం సరైనది. చెప్పాలంటే బాధను కలిగిస్తుంది. సేవ్ పాలస్తిన అన్న మేధావులు ఈరోజు మౌనంగా ఉండటంతో వారు అంతర్గత ఉగ్రవాదులుగా మారారు. అలంటి వాళ్ళను కూడా గుర్తించి, వాళ్లకు బుద్ధి చెప్పి తీరుతమని అన్నారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశమంతా ఐక్యంగా నిలవాలని ఈ ర్యాలీ గళం విప్పింది. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులు అర్పించారు.



సన్న బియ్యం భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

## సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో సహపంక్తి భోజనం చేసిన ఎమ్మెల్యే నాగరాజు

### పేదవాడి కడుపు నింపేందుకు
### కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీచేస్తుంది
### ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ ,ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం బ్యూరో): వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన సన్న బియ్యం లబ్ధిదారుడు చేలుమాల పుష్ప - నర్సయ్య ఇంట్లో జిల్లా కలెక్టర్ సత్య శారద దేవి , వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సహంక్తి భోజనం చేశారు. అనంతరం సన్న బియ్యంతో కడుపునిండా భోజనం పెట్టిన ఆడబిడ్డ చేలుమాల పుష్ప - నర్సయ్య దంపతులకు బట్టలు పెట్టి గౌరవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మకమైన నిర్ణయమని,సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.పేదలు సన్నబియ్యం తినాలనే లక్ష్యంతోనే సన్నబియ్యం పథకం ప్రారంభించినట్లు చెప్పారు.సన్నబియ్యం సరఫరాలో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. త్వరలో ఇందిరమ్మ అభయస్తం పేరుతో 9 రకాల సరుకుల కిట్లను పంపిణీ చేయబోతున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23 (ప్రభాత ఉదయం)బాల్య వివాహలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ శివలీల అన్నారు. బుధవారం గద్వాల మండలం బస్సాపురం గ్రామంలో మహిళా శిశు సంక్షేమ శాఖ వారి చైల్డ్ హెల్ప్ లైన్ 1098 బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ మరియు సంక్షేమం పై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. బాలల రక్షణ, చదువు, వివక్ష, బాల్య వివాహాలు, శారీరక మార్పులు, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ శివలీల మాట్లాడుతూ...బాలల సంరక్షణకు 24 గంటలు ఫోన్ నెంబర్ '1098' సేవలు అందుబాటులో ఉంటుందని అన్నారు. బాల కార్మిక వ్యవస్థ వల్ల పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుందని, పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపే విధంగా తల్లితండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేరిన పిల్లలను బడి మానేయకుండా చూసుకోవాలని కోరారు. బాల్యవివాహాలు, బాల కార్మికులు, మైనర్లకు లైంగిక వేధింపులు, పిల్లలను ఇతర రకాల వేధింపులకు గురి చేస్తే 1098 నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జయన్న, పంచాయతి కార్యదర్శి ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## దక్షిణ మధ్య రైల్వే జీఎంను కలిసిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

### కాజీపేట రైల్వే సమస్యలపై సుదీర్ఘంగా జీఎంతో చర్చించిన వరంగల్ ఎంపీ
### కాజీపేట ప్రాముఖ్యతను ఎట్టి పరిస్థితిలో తగ్గించకూడదు
### కాజీపేట బస్టాండ్ విషయంలో త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలి
### అమృత్ భారత్ పథకం కింద వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి
### కాజీపేట క్రూ లింకుల తరలింపు విషయంలో వివరణ కోరిన ఎంపీ
### కాజీపేట రైల్వే యూనియన్ తో సమావేశంపై వారి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేసిన ఎంపీ
### వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అభ్యర్థనల పట్ల సానుకూలంగా స్పందించిన రైల్వే జీఎం
### మరో మూడు రోజుల్లో కాజీపేట రైల్వే యూనియన్ తో జిఎం సమావేశం



వరంగల్ ,ఏప్రిల్ 23 ( ప్రభాత ఉదయం బ్యూరో): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మెనేజర్ అరుణ్ కుమార్ జైన్ తో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సమావేశం అయ్యారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్ లో ఉన్న రైల్వే సమస్యలను పూర్తి చేయాలని బుధవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో జీఎంకు వినతి పత్రం అందజేశారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ లో కీలకమైన కాజీపేట జంక్షన్ ప్రాముఖ్యతను ఎట్టి పరిస్థితుల్లో తగ్గకుండా చూడాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య రైల్వే జీఎంను కోరారు. కాజీపేట లోకో రన్నింగ్ డిపో సిబ్బందిని విజయవాడలోని లోకో రన్నింగ్ డిపో బదిలీ చేయడం, ప్రస్తుతం కాజీపేట లోకో రన్నింగ్ స్టేషన్ లో కొత్త పోస్టుల భర్తీకి అధికారులు ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడం వంటి విషయాలపై రైల్వే జీఎం ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వివరణ కోరారు. కాజీపేటలో 709 మంది ఉద్యోగుల సంఖ్యకు కేవలం 526 మంది ఉద్యోగులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలియజేశారు. ప్రస్తుతం కాజీపేట లోకో రన్నింగ్ స్టేషన్‌కు 184 కొత్త పోస్టింగ్‌లు మంజూరు చేసినప్పటికి, పోస్టుల భర్తీకి అధికారులు ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని, దీని వల్ల ఉన్న ఉద్యోగులపై అధిక భారం పడుతుందని వరంగల్ ఎంపీ కడియం డా. కడియంకావ్య రైల్వే జిఎం కు వివరించారు. ఇప్పుడు కీలకమైన కోచింగ్ క్రూ లింక్‌లను రైల్వే అధికారులు బదిలీ చేయాలని నిర్ణయించుకున్నారని, జూలై 14, 2022న జరిగిన జాయింట్ కమిటీ సమావేశంలో రైల్వే అథారిటీ ఇచ్చిన హామీని ఉల్లంఘించి, కృష్ణా, ఎల్‌టిటి, కోణార్క్ మరియు గౌతమి ఎక్స్‌ప్రెస్ లను కాజీపేట నుండి విజయవాడ డిపోకు తలుస్తున్నారని పేర్కొన్నారు. మంగళవారం నుండి ఈ ఎక్స్‌ప్రెస్ లింకులను విజయవాడ నుండి ఆపరేట్ చేస్తున్నట్లు అందుకు సంబంధించిన ఛార్జ్ తయారు చేశారని తెలిపారు. గతంలో ఈ లింకును కాజీపేట డిపో వారే అప్ అండ్ డౌన్ రూట్లో నడిపే వారిని పేర్కొన్నారు. ఇప్పుడు ఈ నాలుగు క్రూ లింకులను మార్చకుండా యధావిధిగా కొనసాగించాలని రైల్వే జీఎంను ఎంపి కోరారు. అమృత్ భారత్ పథకం కింద వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అంతేకాకుండా కాజీపేట బస్టాండ్ ఏర్పాటుకు త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని ఎంపి విజ్ఞప్తి చేశారు. గతంలో అధికారులతో కలిసి స్థలం పరిశీలన చేసినట్లు వెల్లడించారు. స్థల నిర్ణయం ప్రకటిస్తే వెంటనే బస్టాండ్ నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత నిర్ణయాలతో కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. రైల్వే యూనియన్ తో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని ఎంపీ జిఎంను కోరారు. వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య అభ్యర్థనల పట్ల రైల్వే జీఎం సానుకూలంగా స్పందించారు. వరంగల్ ఎంపీ కోరినట్లు డివిజన్ ఏర్పాటుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా, కాజీపేట ప్రాముఖ్యతను తగ్గకుండా రైల్వే సమస్యలను పరిష్కరిస్తామని రైల్వే జీఎం తెలిపారని ఎంపీ వివరించారు. మూడు రోజుల్లో రైల్వే యూనియన్ తో సమావేశమై వారి సమస్యలు పరిష్కరిస్తామని రైల్వే జీఎం తెలిపారని అన్నారు. ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తో పాటు ఎంపీలు రఘురాం రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608